# తెరుబారుకథ

ఇచ్ఛాపురపు రామచంద్రం

"యస్ సర్ " తమకేం కావాలన్నట్లు చేతులు కట్టుకుని నిలుచున్నాడు బేరర్.

అతను చాలా ఆలోచించి—చివరకు ఒక నిశ్చయానికి రాగలిగినట్లు — చిరునవ్వు నవ్వుతూ—"ఛిల్డు బీర్." అన్నాడు.

బేరర్ కొంచెం ఆశ్చర్యపడి—అది తన కర్తవ్యం అన్నట్లు సూచించాడు. "చలిగా వుంది."

ఆ సూచనలోని అంతరార్థం—బీరువొద్దు, హాట్ డ్రిం కేదయినా తీసుకొండని.

అతను నవ్వి— "నాకు నిజంగా డ్రింక్స్ అలవాటు లేదు. బీరుకూడా యెక్కువ తాగను. ఒకేగ్లాసు. తరువాత నువ్వు తీసుకోవలసిందే," అన్నాడు.

"ఇంతరాత్రి డ్రింక్స్ కోసం కాకుండా - శ్రమపడి బారుకి రావడం " అనుమానంగా చూశాడు బేరర్, కస్టమర్ అప్పటికే తెగతాగి వున్నాడేమో అని. కాని - నిజంగానే అతను కొంచెమయినా తాగినట్లు లేదు.

"చాలా కారణంవుంది. చెబుతాను. బీరు తీసుకురా. కబుర్లు చెప్పుకుంటూ కానిద్దాం—" అతని ముఖంలోకి చిత్రంగా—పరీక్షగాచూసి కదిలాడు బేరర్.

తాగడానికి వేళాపాళా ఏమిటికానీ, సాధారణంగా—అది తాగుడు పూర్తి చెయ్యడానికే తప్ప ప్రారంభించడానికి మాత్రం వేళకాదు. రెండో ఆట విడిచిపెట్టేసే వేళౌతూంది. మానేజర్ కి కూడా నిద్ర వొచ్చేస్తూంది. చాలామంది బేరర్లు అప్పటికే నిద్రపోతున్నారు. రెస్టారెంట్ సెక్షనెప్పుడో మూసేశారు. తాగుతూ తిండానికి బిస్కట్లూ జీడిపప్పూ తప్ప ఏమీలేవు.

ఆ కస్టమర్ వింత మనిషిలావున్నాడు. కాకపోతే యిప్పుడు రావడం తాగడానికి కాకుండా బార్ కి రావడం—తనతో కలసి తాగుతూ కబుర్లు చెబుతాననడం అన్నట్లు యితనెవరో కాని ఎప్పుడో ఎక్కడో ,చూసినట్లుంది. ఎంత ఆలోచించినా జ్ఞాపకం రావడం లేదు.

ఏదీ కానివేళ ఎద్దీనిందన్నట్లు యిప్పుడు బారుకి రావడం కబుర్లుచెబుతాననడం వెర్రివెయ్యి విధాలుట. అందులో యిదొకటి కాదు కద? ఏమయినా యిప్పుడో చిత్రమయిన కధ జరిగేటట్లుంది. కానియ్ చూద్దాం.

బీరు బాటిలూ గ్లాసులూ పట్టుకుని నటిచాడు బేరర్. కొంచెమయినా నురగ తేలకుండా బాటిలు తెరిచి ఒక గ్లాసునింపి అతని ముందుకు జరిపాడు.

"నువ్వూ పోసుకో. నా కొక్క గ్లాసుచాలు. అన్నట్లు బీర్ కి చీర్సుండవు కదూ?"

"ఉండవు కాని క్షమించండి."

"మంచింగ్ గురించా? ఫరవాలేదు. నాకు ఆకలిగా లేదు. బీరుకి మంచింగ్ పెద్ద అవసరమని నే ననుకోను."

"అదికాదు "

"మరి?" బీరు ఒక గుక్కతాగాడు. "బీరు-సిప్ చెయ్యరు. గల్పింగే. కాని చెప్పానుగా నాకు కొంచెమూ అలవాటూ అవసరమూలేదు." సిగరెట్ అంటించాను.

"నేను తాగను. అందుకే క్షమించమన్నాను. మీతో కలిసి తాగకపోయినా మీ మాటలు వినడానికి నాకేమీ అభ్యంతరం లేదు " వినయంగా అన్నాడు బేరర్.

"నిజంగా తాగవూ?" ఆశ్చర్యపోతూ చూశాడు కస్టమర్. "నమ్మలేక పోతున్నాను. బారులో బేరరుగావుండి కనీసం బీరయినా తాగనివాళ్ళు లేరే మరి "

"నేను చాలా మారిపోయాను. మారవలసి వచ్చింది. పరిస్థితుల లాగ వొచ్చేయి "

"నేనూను. జీవితం చాలా తమాషా అయింది. అది మనిషిని ఏమయినా చెయ్యగలదు. కాకపోతే నేనిప్పుడు యిక్కడ యిలా వుండవలసిన వాడి నెంతమాత్రమూ కాను. నా జీవితం ఓ గమ్మత్తయిన కధే; వింటావా? టూకీగానే చెబుతాలే."

"చెప్పండి. వింటాను. కానీ నన్నొక్క మాట చెప్ప నీయండి."

"తరువాత చెబుదువుగాని తప్పకుండా వింటాను. నే నిక్కడికి యిటువంటి వేళలో ఎందుకు వచ్చానో చెబితే ఆశ్చర్యపోతావు. నే నెవరినో తెలుసా? లక్షాధికారిని? వ్యాపారస్తుణ్ని. కలకత్తా వెళ్తూ యిక్కడ ఆగాను. నిజానికి చాలా ముందే వొచ్చి—యిక్కడ ఎక్కువ సేపు గడపాలనుకున్నాను. కాని— పాడురైలు ఆలస్యమైంది. అన్నట్లు పదేళ్ళ కిందట యీ బారుకి రెస్టారెంట్ వుండేది కాదు కదూ?"

"పదేళ్ళ కిందట ఉహుం ఉండేది కాదు—"

"నీకెలా తెలుసు?"

"ఇది మా వూరేకదా?" ఆగి "మీరూ పదేళ్ళకిందట యిక్కడ బిజినెస్ చేసేవారా?"

"బిజినెస్ కాదు. ఈ బారులోనే బేరర్ని."

"ఆ!"

"అందుకు — ఆ మాట చెప్పుకుందుకు నేనేమీ సిగ్గుపడను. ఆ ఉద్యోగమే నన్నింత వాడిని చేసింది. ఎలా అంటావా? ఆరోజుల్లో బారుకి వొచ్చే వాళ్ళ సంఖ్య తక్కువే. కాని - రామ్‌లాల్ మాత్రం పదిమంది పెట్టు. కనీసం ఐదారుగురు స్నేహితులని వెంటేసుకుని రోజూ వచ్చేవారు. వారికి విధేయతతో అన్నీ అతి జాగ్రత్తగా సమకూర్చే వాడిని. ఆయన ఉదారుడు. రోజూ నాకు ఐదారు రూపాయలకి తక్కువ కాకుండా టిప్పు యిచ్చేవారు. అప్పటికి నేనింకా బ్రహ్మచారినే. బారువాళ్ళే భోజనమూ వసతీ యిచ్చి జీతమిచ్చేవారు. నా కేమంత ఖర్చులుంటాయి? రామ్‌లాల్ గారిచ్చే డబ్బంతా జాగ్రత్తగా దాచేవాడిని. నేనీ బారులో నాలుగైదేళ్ళ పాటు పనిచేశాను. ఐదారువేలపై చిలుకే జమ ఐంది బ్యాంకులో నేను కూడ బెట్టినది. దానితో బేరర్ పని మానేసి—మా వూరు పోయి బిజినెస్ ప్రారంభించాను. కలిసొచ్చింది. లక్షాధికారి నయ్యాను. నే నెప్పుడూ యీ బారుకీ ఆ రామ్‌లాల్ గారికీ కృతజ్ఞుణ్నే. ఎన్నోసార్లిక్కడకు వొచ్చి నా కృతజ్ఞతలు తెలుపుకుందా మనుకునేవాణ్ని. కాని వ్యాపారంలో తీరిక చిక్కేదికాదు. చివరకివాళ కలకత్తా వెళ్తూ యిక్కడ దిగాను. కాని ఏం లాభం? రైలు లేటయి అర్ధరాత్రి దాటింది దిగేసరికి. అనాటి బారుకాదిది. చాలా మారిపోయింది. మానేజరెవరో కొత్తవాడు వచ్చినట్లుంది; ఆ మానేజర్ని రామ్‌లాల్‌నీ కలుసుకుని కృతజ్ఞతలు తెలుపుకోవాలన్న నా కోరిక తీరదేమో! అసలు - రామ్‌లాల్ గారిక్కడ లేకపోడం చాలా ఆశ్చర్యమే. చీకటి పడుతూంటే వచ్చి తెల్లవార బోయేవరకూ బార్‌లోనే ఉండే వా రా రోజుల్లో "

"ఇప్పుడూ వారంతే. ఏటొచ్చీ మీ రన్నట్లు చాలా మార్పు." అన్నాడు బేరర్.

"అంటే?"

"జీవితం క్రూరమైంది. బారు—మరేని. జమీందారయిన రామ్‌లాల్ తన ఆస్తినంతటినీ యీ బారుకే ధారపోసేశాడంటే అట్టే అబద్ధం లేదు. ఆ చిన్న జమీందారు — పదేళ్ళలో పకీరయిపోయాడు. అప్పులే మిగిలాయి. చివరకి భార్యకూడా అతన్నివదిలి వెళ్లిపోయింది. అతని బతుకు రోడ్డుమీద పడింది. వ్యసన

పరువీ కంతకంటె చక్కని శేష జీవితం ఎలా లభిస్తుంది? పాపరయినా అతను చచ్చి పోలేక పోయాడు. ఆత్మహత్య చేసుకోలేకపోయాడు. బ్రతుకు—దొడ్డతీపి కదా? రోడ్లవెంట పిచ్చివాడిలా తిరగసాగాడు. ఎవరేనా పెట్టిస్తే తినడం పోయిస్తే తాగడం. అలా వుండేవాడు. అలా రోడ్లుపట్టి తిరుగుతున్న రామ్‌లాల్‌ని చూసి జాలిపడి—బార్ మానేజరు గతం మరవలేని కృతజ్ఞతా విశ్వాసాల కొద్దీ యిక్కడ బేరర్ పని యిచ్చాడు. అందుచేత రామ్‌లాల్ యిప్పుడూ చీకటిపడ్డాక బార్‌కివచ్చి తెల్లవారే ముందే వెళ్తున్నాడు—"

"ఆః రామ్‌లాల్ జమీందారు బేరరయ్యాడా! విధి ఎంత చిత్రమైనది!"

"అంతే కాదు. ఒకనాటి బేరరూ, యీనాటి కస్టమరూ ఐన మీకుబీరు తెచ్చి అందించినది– ఒకనాటి కస్టమరూ, యీ నాటి బేరరూ ఐన రామ్‌లాలే. తన యీ స్థితికి దింపిన తాగుడుమీద అతనికి చాలా ద్వేషం. కనుకనే యివాళ యిప్పుడు మీతో కలిసి బీరయినా తీసుకోలేదు. "

"అంటే మీరు ?"

"ఆ( రామ్‌లాల్‌నే. చితికి పోయిన చిన్న జమీందారునే." త్వర త్వరగా నడిచివెళ్తూ .. "మీరు కలుసుకుందా మనుకున్న రెండోవ్యక్తి మానేజరు ఊళ్ళోలేరు." అన్నాడు.

కస్టమర్ విభ్రాంతుడయ్యాడు.

నీరసంగా లేచి నడుస్తూ . "జీవితం కామెడీయే కాదు, ట్రాజిడీ కూడా!" గొణుక్కున్నాడు.

[ఈ కథకి నీతి —జార్లనీ పకీర్లనీ తారుమారు చేయగలిగే బార్లుండవొచ్చు. వాటినే తారు బార్లంటారు. బివేరాఫ్ దెమ్.] □

